# "ఆడచెత్త—మగమాణిక్యము"

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

## ౧

ఐదవపర్యాయముకూడ తన కాడుబిడ్డయే పుట్టినదన్న వార్త విన్నపుడు రమణయ్యకు జనించిన ఉడుకుబోతుతనము ఇంతింతనరానిది. తనజీవితమంతయు కుమార్తెలకు వివాహసంబంధములు వెతకుటకు సరిపోవును కాబోలునని ఆతడు విసిగినాడు. అప్పటికాతని పుత్రికలలో ముగ్గురకు వ్యయప్రయాసలకోర్చి వివాహములు చేసినాడు. నాల్గవదాని మాట యేమిటని దిక్కులజూచు నాతనికి భారమును పెంపుజేయుటకై మఱియొకర్తు అవతరించినదన్నపుడు నిరుత్సాహముగాక మఱియేమి?

పురిటిశుద్ధినాడు పీటలపైన కూర్చుండుటకూడ జరుగలేదు. "పిల్లను ఏమని పిలుతు"మని అన్నపూర్ణ యడిగినప్పుడు రమణయ్య "నా గర్భశత్రువైన మీనాయన పేరు" అని సమాధానమిచ్చినాడు.

అన్నపూర్ణ మరల ఆడబిడ్డనే కని చేసిన మహాపరాధమునకు మిక్కిలి వగచినది. కాని తన యక్కలకువలెనే నవమాసములు జననిగర్భమున నుండి, వెలికి వచ్చిన శేషయందు అన్నపూర్ణకు గల మాతృవాత్సల్యమున నెట్టిలోపమును కానరాదు. శేష తండ్రియేవగింపునకు గుఱియైనకొలదిని తల్లియనురాగమున కాటపట్టయినది.


## ౨

శేషకు ఎనిమిదేండ్లు నిండినవి. పాపమామె పట్టణమునజనించిన బాలికయయ్యును పలకబుచ్చుకుని పాఠశాలకు బోవ నోచుకొనలేదు. ఆమెకు తల్లియే ఉపాధ్యాయిని. ఆమె కట్టుకొను పరికిణియును, తొడుగుకొను చొక్కాయును, తన అక్కలకు చాలకపోవుటచే వారుపయోగించుట మానివేసినవే.

నిరపరాధినియగు శేష నిట్టి యనాదరణకు లోనుజేసి, రమణయ్య భగవంతునిపై కసిదీర్చుకొన జూచినాడు. ఆదంపతు లెట్టి ఏర్పాటులను జేసుకొనిరో కాని శేషకు తొమ్మిదేండ్లు గడచినగాని అన్నపూర్ణకు కాన్పు రాలేదు. సృష్టికర్త ఝడిసికాబోలు రమణయ్యకీతూరి మగశిశువునే ప్రసాదించినాడు.

శేష చిన్నతమ్ముని జూచి మురిసిపోవుచు, నిత్యమును ఎత్తుకొని మోసి ఆడించుచుండెడిది. కాని చిన్నతమ్ముని జననమువలన నామెదుస్థితి చక్కబడలేదు. కన్నతల్లి కడుపు తీపుచే ఒకనాడు "ముద్దుముచ్చటలు తీరని శేష కొక్క ముక్కుపుడకను కొనరూ?" అని అడిగినప్పుడు, "కుఱ్ఱవానిని నీళ్లబిం

డెలు మోసి పెంచెదవా?" అని భార్యను నోరెత్తకుండ జేసినాడు రమణయ్య.



"శేష తండ్రియేవగింపునకు గుఱియైనకొలదిని తల్లి యనురాగమున కాటపట్టయినది."

రమణయ్య నాల్గవకుమార్తెకు సంబంధమును వెదకి తెచ్చినాడు. ఇప్పుడు పూర్వమువలె కట్నముల నిచ్చి వరులను సంపాదించు పని కాతడు పూనలేదు. బహుశః కారణము, బయలుదేరుచున్న కుమారుని పెంచుటకై తాను వంటలు చేయవలసివచ్చునన్న భయము కాబోలు! కనుకనే, వరాన్వేషణయందు 'ప్రయిమరీ ప్యాస'యి, 'ట్రెయినింగ'వుచున్న యువకుని కంటె పైస్థాయిలోని కాతడు పోజాలడయ్యెను. వివాహము దేవాలయమున జరిగినది.

శేషకు ప్రాయముకంటె జ్ఞానము ఎక్కుడు రయముగ వచ్చుచున్నది. ఆమె ఇతరుల భావములను అతిసూక్ష్మముగ

గ్రహింపగలదు. “తోటిపిల్లలకువలె తన చిట్టికోరికలు తీరుటలేద”ను తలపామెను బాధింపదు. అట్టిబాధ యొకటి తనతల్లిని వివిధస్వరూపముల వేపుచున్నదను జ్ఞానమామెను పీడింపజొచ్చినది.

3

రమణయ్యను లోభ మావరించినది. తానీ లోకమును వీడిపోయినపిదప కుమారుడు తన కుత్తరలోకప్రాప్తికై, కృతజ్ఞతతో పాటుపడవలెనన్న, తగినంతవసతి నాతనికి చూపిగాని తాను శాంతముగ మరణింపజాలడు. కనుక ఆస్తిని సేకరించుట కాతడు దీక్షను పూనినాడు.

కొడుకునకై మూటగట్టవలెనను పిపాస ఆతనికూతురు పసుపుకుంకుమల గాపాడవలెననెడి అభిలాషను త్రోసిరాజన్నది.

శేషకు ద్వాదశవర్షములు నిండినవి. ఆపెజవ్వనము తొంగిచూచుచు అన్నపూర్ణ హృదయాంతరాళమున నూతన వేదనకు తావుజూపినది. శేషను తనభర్త కొబ్బెర బొండముతో వీధిపోవు మధూకరపువానికి భార్యగా నొసగి బాధానివృత్తి జేసుకొనునేమో అను భయము అన్నపూర్ణ నావహించినది. కాని విధాతృవిధాన మన్యథా యైనది.

౪

వెంకటచలంపంతులుకు, డిప్టీకలెక్టరీ పదవిని చాలించుకొని ఉపకారవేతనము పొందుకాలము సమీపించుసమయమున భార్యావియోగము సంభవించినది. గతించినకళత్రము ఆజన్మాంతము వ్యాధిపీడితయై, సంతానమును బడయజాలకపోయినది.


అనపత్యుడగు పంతులుగారి యాస్తి రమణయ్య నోరూరజేసినది. పరామర్శకై పోయి, ప్రసంగవశమున వచ్చిన మిత్రునిమాట నూతగా గొని, ఆతడీసంబంధమును నిశ్చయించుకునివచ్చెను. శేష ఎదిగినపిల్ల యనియు, రమణయ్య స్థితి ఇప్పుడు చితికిపోయినను మంచివంగడమువాడనియు తలచి వెంకటచలంపంతులుగారు అంగీకరించిరి.

అన్నపూర్ణ శేషను వృద్ధున కిచ్చి పెండ్లిజేయుట తగదని మగనితో పలుకసాహసించినది. ప్రభుత్వపువిధుల ననుసరించి పింఛను పుచ్చుకోవలసినవాడైనను, పంతులంత ప్రాయముచెల్లినవాడు కాడనియు, అట్టిసంబంధము చిక్కుట శేషయదృష్టమే అనియును తెలిపి రమణయ్య పెండ్లిసన్నాహము చేసినాడు.

వివాహానంతరము పంతులు శేషను తనతో నివసించుటకు తీసుకొనిపోవ నిశ్చయించినాడు. రమణయ్య కానాడు శరీరము తేలికమైనట్లు తోచినది. తనయింట నున్నంత కాలము శేష దౌర్భాగ్యజీవితమున నెట్టిపరిణామమును రాజాలదని భావించెడి అన్నపూర్ణ ‘సరే’ అని మాట దక్కించుకున్నది.

౫

వెంకటచలమునకు ఎండి మోడైపోనున్న తన జీవితవృక్షమునకు చిగురు అని ఊహచే నిర్ధారణచేసుకుని, మరుక్షణముననే తీర్చి ఆమెకు ఆనందమునకుతో డాశ్చర్యమును కలుగజేసెడివాడు.



"మగని జీవితశేషమును సౌఖ్యప్రదముగ జేయుటయే తనకు పరమావధియని తలచిన దా. మె"

తోడుగు వసంతలక్ష్మివలె గాన్పించినది శేష. ఆమెమెయినిండ భూషల నలంకరించి, 'సువర్ణమునకు వన్నెదెచ్చిన దీదేహకాంతి' యని మురిసినా డాతడు. ఆమెకోర్కెలు 'ఇట్టివి'

తండ్రికి భారమని తోపించి తల్లికి శోకమునుగూర్చిన తన నికృష్టపుజీవనము తుదకు భర్త కానందమును చేకూర్పగలుగుచున్నదని శేష గ్రహించి సంతుష్టిపొందినది. ఈ

సంతుష్టి ఆమెయందు నూతనమగు వికాసమును, ఉత్సాహమును జనింపజేసినది. తన యావచ్ఛక్తిని వినియోగించి, మగని జీవిత శేషమును సౌఖ్యప్రదముగ జేయుటయే తనకు పరమావధియని తలచిన దామె. తదుద్యమమున నిమగ్నమైయున్న ఆపె మానసమున 'వెంకటచలము వృద్ధు'డనుతలపెన్నడును పొడచూపలేదు.

౬

శేషకు పదియునెనిమిదేండ్లు వచ్చు నప్పటికి పంతులుగారికి షష్టిపూర్తి యైనది.

'ఏక్షణమున కేమికానున్నదో' అను వివేకము పురికొల్ప, ఆత డొకనాడు తన యావదాస్తిని దానాధమనవిక్రయాధికారములతో భార్యకు చెందున ట్లేర్పాటుజేసెను. తన కవసాన మాసన్నమగుచున్నదని తోచి పంతులు భార్యను చేరదీసి, 'చీమవలె కూడబెట్టిన ఈమాస్తిని జూచుకొని, అనుభవింప దారాపుత్రులు లేరుకదా అను విచారమును పోగొట్టుకొన నిశ్చయించి నిన్ను పెండ్లిచేసు కొంటిని. నాకు సంతానము కలుగకున్ననూ దారవలన పడయతగిన సౌఖ్యముల ననుభవించితినను తృప్తితో ఈలోకమును వీడిపోయెదను ...... స్వార్థపరుడనైన నన్ను అన్నివిధముల ప్రేమించి ధన్యుని జేసితివి. నీజీవిత మింక అంధకారమయము గాబోవుచున్న దను పరితాపము నన్ను వేధించుచున్నది. నీకిష్టమైనచో ఒకపిల్లవానిని చేరదీసి, పెంచుకొని వియోగదుఃఖమును శమింపజేసుకొనుము. వాడు నీవృద్ధాప్యమున బాసటమై నిలుచుటయేగాక, నాకుత్తమగతులను కలుగజేయుటకు గూడ వీలగును." అని పలికెను.

శేష యామాటలను వినుచు కంట నీరు పెట్టుకొనజొచ్చినది.

ఆవృద్ధు డనంతరము ఎంతోకాలము జీవించలేదు. శేషజవ్వనమును, పసుపుకుంకుమలను జూచి, మతిచెడి మరుగున తిరుగాడుచున్న మృత్యుదేవత 'ఇంక జాగుచేసిన మాటవచ్చు'నని తలపోసికాబోలు, ఆముదుసలి జీవమును గ్రహించుకొనిపోయి, తనవిధిని నెరవేర్చుకొన్నది.

౭

'పదియునెనిమిదేండ్ల బాలికను ఘోర వైధవ్యమునకు చేతులార నప్పగించితి'మని విలపించిన దన్నపూర్ణ.

'భాగ్యవంతుని పెండ్లియాడి సుఖపడు ననుకొంటిమిగాని ఆయన ఇంతలో మరణించు ననుకొనలేదుగదా! రాఘవయ్యపంతులు ఏబదవ సంవత్సరమున రెండవమారు వివాహము చేసుకుని ముప్పదేండ్లు భార్యతో కాపురము చేయలేదా! దాని మగ డంతత్వరలో చనిపోవుట మన శేషదురదృష్టము' అనినాడు రమణయ్య.

'ఆమె అదృష్టహీన గనుకనే నావంటి దౌర్భాగ్యురాలికడుపున జనించినది' అని

ఆయమ వాపోయినది. రమణయ్య మాట లాడక అటనుండి మెల్లగ జారినాడు.

పుట్టెడుకష్టమున మునిగిన కుమార్తె వ్యవహారములను చక్కబెట్టునిమిత్తము రమణయ్య భార్యాపుత్రులను వెంటబెట్టుకొని పయనమై బెజవాడనుండి రాజమహేంద్ర వరము చేరెను. వ్యవహారముల నన్నిటిని కట్టుదిట్టముచేసియే తనయల్లుడు గతించెనని కాగితములను తిరుగవేసినయాతడు గ్రహించినాడు. "శేష కెట్టి యపకారమును జరుగ లేద"నుకొని యాతడు తుష్టిచెందెను విచారమును బాపుకొన తనయింటికి వచ్చియుండు మని ఆమెతో నాతడు చెప్పిచూచినాడు.

"నే నెచ్చటకు పోయిననూ నావిచారము తీరునదికాదు." అనినది శేష.

"నీ విక్కడ ఒక్కతెవు ఎట్లుండగలవు?"

"ఎక్కడనున్ననూ నే నంక నొక్కతెనే గదా!"

అన్నపూర్ణ ఆమాటలను విని 'గొల్లు' మన్నది. రమణయ్య నోరెత్తలేకపోయెను.

౨

"ప్రేమయన నిట్టిద"ని చూపి దివంగతుడైన భర్తను స్మరించుకొనుచు శేష కాలము గడుపుచున్నది. ఒకనాడు రమణయ్య బెజవాడనుండి ఏతెంచి "అమ్మాయీ" అని పిలిచినాడు.

"ఏమి నాన్నా?"

"నీభర్త ఇంగ్లీషుచదివి గొప్పయుద్యోగముచేసినవాడయ్యును పుర్వాచారపరాయణుడై పారమార్థికచింతతో జన్మను వెడలబుచ్చినాడు. అనపత్యులకు గతు లుండవను మతములోనివా డాతడు. ఆతని కుత్తమలోకప్రాప్తి కలుగజేయుట నీవిధిగదా!" అని ఆగినాడు రమణయ్య.

"అవును; అది నావిధియే."

"అందువలన నీ వొక పిల్లవానిని దత్తునిగా స్వీకరించుట అగత్యము."

"అవును."


"....................."

"ఎవరిని దత్తతచేసుకొనిన బాగుండునని నీయుద్దేశము?" అని అడిగినది శేష. రమణయ్య గొంతుసవరించుకొని, "పెంచుకొనవలెనన్న నీకు నన్నిహితుడై హత్తుకొని ఉండగల కుఱ్ఱవాడు కావలెను." అనినాడు.

"అవును."

"చిన్నప్పుడు నీచేతులలో పెరిగి నీ ప్రేమ కాస్పదుడైన నీముద్దులతమ్మునికిదక్క అన్యులకు ఆహక్కు లేదు." అని తుదకు తేల్చినాడు రమణయ్య.

రమణయ్య ఏకపుత్రుడగు భాస్కరమును దత్తునిగా నిచ్చివేయదలచినాడని గ్రహించినప్పుడు శేష ఆశ్చర్యమునకు లోనైనది. ఆతడుమాత్ర 'మనపత్యులకు గతు లుండవ'నుమతములోనివాడు కాడా!



"నీముద్దులతమ్మునికిదక్క అన్యులకు ఆహక్కు లేదు."

"నీకునూ మాకునూ భేదము లేదుగనుక భాస్కరము మీయింట పెరుగుచున్ననూ మాయింట నున్నట్లే మేము భావించెదము" అనినాడు రమణయ్య.

శేష భర్తయొక్క అభీప్సితమును పురస్కరించుకొని, తండ్రిసలహా ననుసరించి భాస్కరమును దత్తునిగా జేసుకొనినది.

## ౬

శేషకు జబ్బుగానున్నదని బెజవాడకు తంతివచ్చినది. ఆసాయంకాలమునకు రమణయ్య భార్యతో రాజమహేంద్రవరము చేరినాడు.

"అప్ప మొన్న ఉపవాసముచేసి చలిమిడితిని కొబ్బరినీరు త్రాగినది. అప్పటినుంచీ

విరేచనములు ప్రారంభమై తగ్గుటలేదు. డాక్టరుగారు మందు ఇచ్చుచున్నారు. ఎందుకైననూ మంచిదని చెప్పి, మీకు టెలిగ్రాము ఇయ్యమన్నారు." అన్నాడు భాస్కరము.

"అజీర్తిచేసినది. ఒకమోతాదు క్రవ్యాది పుచ్చుకున్నచో తగ్గిపోవును" అని రమణయ్య ఊహించినాడు.

అన్నపూర్ణ శేషప్రక్కను శయ్యపై కూర్చుని ఆమెను చూచినది. రోగియందు దృశ్యమగుచున్న నిస్త్రాణ తల్లి హృదయమున గగ్గోలు పుట్టించినది. "అమ్మాయీ!"

"అమ్మా! తుదకిది అతిసారములోనికి దింపినది. నే నింక జీవింపను." అన్నది శేష హీనస్వరమున.

అన్నపూర్ణ 'బేరు' మన్నది. రమణయ్య "అనవసరముగా అధైర్యపడి దానిని హడలగొట్టుచున్నావు" అని భార్యను మందలించినాడు.

"అమ్మా! పదార్థమును ఛాయవలె జీవితమును మృత్యు వనుసరించుచునే యున్నది. ప్రతివ్యక్తికిని మరణము ధ్రువమను జ్ఞానము కలదు. కాని 'బ్రతికియున్న సౌఖ్యమనుభవింపవచ్చు'నను మొండిధైర్యము మృత్యుదేవతకు భయంకరస్వరూపము నిచ్చుచున్నది. ఈజన్మయందట్టి యవకాశములు లేని నాకు మరణ మాహ్వానింపదగినది. పుట్టినది మొదలు నాన్నకు భారమనిపించితిని. నీప్రేమ కాస్పదురాలనై నీబెంగకు కారణమైతిని. ఆస్తినంతను చేతబెట్టుటకోయన నా పాణిగ్రహణము చేసుకొన్న మీయల్లుడు గతించినారు. కనుక నాదౌర్భాగ్యజీవితము వలన ప్రయోజనము శూన్యము. నన్ను మృత్యు వింతత్వరలో గౌరవించుచున్నదన్న సంతోషము నాకు కలుగుచున్నది. నాకు శాంతము నెలకొన్నది. వివాహవ్యాజమున నాకు సంక్రమించిన యాస్తిని తమ్మునికంద చేసి, నాన్నగారి ఋణమును ఈవిధముగా తీర్చుకోగలుగుచున్నానను తృప్తి నన్ను స్వస్థచిత్తముతో మృత్యుదేవతఒడిని చేర చేయుచున్నది." అని పలుకుచు శేష మందములగు దృష్టుల సారించినది.

కుమార్తె దేహస్థితియందతిశీఘ్రముగ కలుగుచున్న పరిణామమును చూచుచు అన్నపూర్ణ రోదనము చేయజొచ్చినది. భాస్కరము వెఱ్ఱివానివలె చూచుచున్నాడు. శేష కన్నులుమూసి, తల్లియొడిలోనుండి నిద్రించుశిశువువలె కాన్పించుచున్నది.

---